


## ఇండిగో లాభం రెండింతలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: దేశీయ విమానయాన రంగంలో అగ్రగామి సంస్థ ఇండిగో అంచనాలకుమించి రాణించింది. డిసెంబర్ త్రైమాసికానికిగాను పన్నులు చెల్లించిన తర్వాత రూ.2,998.1 కోట్ల నికర లాభాన్ని గడించింది. 2022-23 ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.1,422.6 కోట్లతో పోలిస్తే రెండింతలు పెరిగింది. ఈ సందర్భంగా ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ మాట్లాడుతూ..ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో పన్నులు చెల్లించిన తర్వాత 30 బిలియన్ రూపాయల లాభాన్ని గడించినట్లు, వరుసగా ఐదో త్రైమాసికంలోనూ లాభాలు అందుకోవడం విశేషమన్నారు. కరోనాతో కుదేలైన విమానయాన రంగం తిరిగి కోలుకున్నదన్నారు. గత త్రైమాసికానికిగాను కంపెనీ ఆదాయం రూ.15,410.2 కోట్ల నుంచి రూ.20,062.3 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో ప్యాసింజర్ విమాన టికెట్లపై వచ్చే ఆదాయం 30 శాతం పుంజుకొని రూ.17,157 కోట్లు ఆర్జించింది.



## ఎయిర్ ఇండియా ప్రత్యేక ఆఫర్లు

**రూ.1,799కే విమాన టికెట్**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: విమాన ప్రయాణికులకు శుభవార్తను అందించింది టాటాకు చెందిన విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా. ప్రయాణికులను ఆకట్టుకోవాలనే ఉద్దేశంతో ప్రత్యేక ఆఫర్లను తెరపైకి తీసుకొచ్చింది. దేశీయంగా ప్రారంభ విమాన టికెట్ ధరను రూ.1,799(వన్-వే), అంతర్జాతీయ రూట్‌లో రూ.3,899గా నిర్ణయించింది. ఈ నెల 5 వరకు మాత్రమే ఈ బుకింగ్ ఆఫర్ అందుబాటులో ఉంటుందని పేర్కొంది. ఈ ఆఫర్ కింద బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు సెప్టెంబర్ 30లోగా ఎప్పుడైనా ప్రయాణించవచ్చునని వెల్లడించింది. ఎయిర్ ఇండియా వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా జరిగే బుకింగ్‌లపై విధించే కన్వియెన్స్ ఫీజును పూర్తిగా ఎత్తివేసింది. ఎకానమి క్లాస్ టికెట్ ధరను రూ.1,799గా నిర్ణయించిన సంస్థ..బిజినెస్ క్లాస్ టికెట్ ధర రూ.10,899. అమెరికా, కెనడా, బ్రిటన్, యూరప్, ఆస్ట్రేలియా దేశాలకు సంస్థ విమానాలను నడుపుతున్నది.

# ఊరించి.. ఉరుకులు పెట్టి


## అమ్మకాల ఒత్తిడితో ఆరంభ లాభాలు ఆవిరి

### +1,444 నుంచి +440కి పడిపోయిన సెన్సెక్స్

## ఇంట్రా-డేలో ఆల్‌టైమ్ హైకి నిఫ్టీ

### ఆకట్టుకున్న రిలయన్స్, ఇన్ఫీ, టీసీఎస్ షేర్లు

ముంబై, ఫిబ్రవరి 2: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభాల్లో ముగిశాయి. అయితే ఉదయం ఆరంభంలో ఉన్న జోష్.. ఆఖర్లో ముగింపు సమయానికి మాత్రం లేదు. కొనుగోళ్ల మద్దతుతో బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ ఒకానొక దశలో 1,444.1 పాయింట్లు లేదా 2 శాతానికి ఎగిసి 73,089.40 స్థాయిని తాకింది. ఇదే సమయంలో నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) 429.35 పాయింట్లు లేదా 1.97 శాతం ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా తొలిసారి 22,126.80 వద్దకు వెళ్లింది. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా నిఫ్టీ ఆల్‌టైమ్ హై రికార్డుల్లోకి వెళ్లడం ఇది ఐదోసారి. ఈసారి రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్), ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) షేర్లు ఇన్వెస్టర్లను అమితంగా ఆకట్టుకోవడం కలిసొచ్చింది. కానీ ఇదే క్రమంలో మదుపరులు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో ఈ ఉత్సాహం కాస్తా ఆవిరవుతూ వచ్చింది. చివరకు సెన్సెక్స్ 440.33 పాయింట్లు లేదా 0.61 శాతం పెరిగి 72,085.63 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 156.35 పాయింట్లు లేదా 0.72 శాతం అందుకుని 21,853.80 వద్ద నిలిచింది.



**రంగాలవారీగా..**

ఆయా రంగాలవారీగా చూస్తే.. చమురు-గ్యాస్ సూచీ 4.22 శాతం, ఎనర్జీ 3.44 శాతం, మెటల్ 2.95 శాతం, సర్వీసెస్ 2.22 శాతం, యుటిలిటీస్ 2.18 శాతం, ఐటీ 2.17 శాతం, పవర్ సూచీ 1.81 శాతం చొప్పున పెరిగాయి. పవర్‌గ్రిడ్, ఎన్టీపీసీ, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, విప్రో, టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు కూడా భారీగా పుంజుకున్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ విలువ బీఎస్ఈలో 2.18 శాతం ఎగిసి 2,914.75 వద్ద ముగిసింది. ఇంట్రా-డేలోనైతే 3.40 శాతం ఎగబాకి ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ.2,949.90 వద్దకు చేరింది. ఇక ఎన్ఎస్ఈలోనూ 2 శాతం పెరిగి రూ.2,913 వద్ద స్థిరపడింది. మరోవైపు ఈ ర్యాలీతో సంస్థ మార్కెట్ విలువ ఈ ఒక్కరోజే రూ.41,860.54 కోట్లు పెరిగి రూ.19,72,028.45 కోట్లకు చేరింది.

**ద్రవ్యలోటుతో..**

'మధ్యంతర బడ్జెట్ మార్కెట్‌పై ఏ రకంగానూ ప్రతికూల ప్రభావాన్ని చూపలేదు. ప్రీ-ఎలక్షన్ ర్యాలీ కొనసాగిందనే చెప్పుకోవచ్చు. కానీ ద్రవ్యలోటు లక్ష్యంలో అంత భారీ తగ్గుదల.. బాండ్ ఈల్డ్స్‌లో క్షీణతకు దారితీస్తుంది. ఫలితంగా కార్పొరేట్ రుణ వ్యయాలు తగ్గుముఖం పడుతాయి. అంతేగాక పెట్టుబడుల కోసం మరిన్ని ప్రోత్సాహకాలను ఇవ్వాల్సి వస్తుంది' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ హెడ్ ఇనోద్ నాయర్ అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25) దేశ జీడీపీలో ద్రవ్యలోటును 5.1 శాతానికి కట్టడి చేస్తామని గురువారం పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రకటన సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పిన విషయం తెలిసిందే. ఆపై ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను 4.5 శాతంగానే లక్ష్యాన్ని పెట్టుకున్నారు. ఇక ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) ద్రవ్యలోటును 5.8 శాతానికి అదుపు చేస్తామన్న విశ్వాసాన్ని మోదీ సర్కారు కనబరుస్తున్నది. నిజానికి నిరుడు బడ్జెట్ ప్రకటన సమయంలో ఈసారి జీడీపీలో ద్రవ్యలోటు 5.9 శాతంగా అంచనా వేశారు. ఈ నేపథ్యంలోనే ఒక్క ఏడాదిలో ద్రవ్యలోటును 0.7 నుంచి 0.8 శాతం మేర తగ్గించాలని చూడటం కూడా మంచిది కాదన్న అభిప్రాయాలు ఇప్పుడు మార్కెట్ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి.

**గ్లోబల్ మార్కెట్లలో..**

ఆసియాలోని ప్రధాన మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్ సూచీలు లాభాల్లో ముగియగా.. చైనా, హాంకాంగ్ సూచీలు నష్టపోయాయి. అమెరికా మార్కెట్లు గురువారం భారీ లాభాలను అందుకున్నాయి. ఐరోపాలోని కీలక సూచీలైన జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్ సూచీలూ లాభాల్లోనే కదలాడుతున్నాయి. ఇదిలావుంటే బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.80 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.49 శాతం చొప్పున పెరిగాయి. ఇక ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 1,384.96 పాయింట్లు లేదా 1.95 శాతం, నిఫ్టీ 501.2 పాయింట్లు లేదా 2.34 శాతం పుంజుకున్నాయి. గురువారం మాత్రం సెన్సెక్స్ 107 పాయింట్లు, నిఫ్టీ 28 పాయింట్లు నష్టపోవడం గమనార్హం. అంతేగాక విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) సైతం ఈక్విటీ మార్కెట్ల నుంచి ఈ ఒక్కరోజే రూ.1,879.58 కోట్ల పెట్టుబడుల్ని వెనక్కి తీసుకుపోయారు.




## సింగిల్ చార్జింగ్‌తో 190 కిలోమీటర్లు

### ఓలా నుంచి సరికొత్త స్కూటర్..ధర రూ.1.09 లక్షలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: స్కూటర్ల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్..మరో మూడు మాడళ్లను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 190 కిలోమీటర్లు ప్రయాణించే ఈ స్కూటర్ ధర రూ.1,09,999గా నిర్ణయించింది. ముందస్తు బుకింగ్ చేసుకున్న కస్టమర్లకు ఏప్రిల్ నుంచి అందచేస్తున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు బ్యాటరీ వ్యారెంటీని ఎనిమిదేండ్లు లేదా 80 వేల కిలోమీటర్లు వరకు పొడిగించింది. బ్యాటరీ పనితీరుపై ఆందోళన వ్యక్తం చేస్తున్న కస్టమర్లకు ఇది ఊరటనిచ్చే అంశమని ఓలా సీఎండీ భావిష్ అగర్వాల్ తెలిపారు. నూతన ఎస్1 ఎక్స్ 4కిలోవాట్ల బ్యాటరీ సామర్థ్యం కలిగిన ఈ స్కూటర్ సింగిల్ చార్జింగ్‌తో 190 కిలోమీటర్లు, గంటకు 90 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించవచ్చునని తెలిపింది. కేవలం 3.3 సెకండ్లలో 40 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్నది. చార్జింగ్ ఇబ్బందులను అధిగమించడానికి చార్జింగ్ పాయింట్లను పెంచుతున్నట్లు ఆయన ప్రకటించారు. శుక్రవారం విడుదల చేసిన వాటిలో 4కిలోవాట్ల సామర్థ్యం కలిగిన స్కూటర్ ధర రూ.1,09,999 కాగా, 3 కిలోవాట్ల బ్యాటరీ మాడల్ రూ.89,999, 2 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ ధర రూ.79,999గా నిర్ణయించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 414 సర్వీస్ సెంటర్లు ఉండగా, వచ్చే రెండు నెలల్లో ఈ సంఖ్యని 600కి పెంచుకోనున్నట్లు ప్రకటించింది.

## ఉత్పత్తుల ధరలతోనే సబ్సిడీల్లో కోత

- **కేంద్ర ఆర్థిక కార్యదర్శి**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: ప్రభుత్వం అందించే కొన్ని సబ్సిడీలు పెరగకపోగా, కాస్త తగ్గడం తమకు ఊరటనిచ్చిందని, దీంతో ద్రవ్యలోటును పరిమితం చేయగలుగుతామని కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్ చెప్పారు. ముఖ్యంగా ఆహార, ఎరువుల సబ్సిడీలు తగ్గడానికి కారణం ఆయా ఉత్పత్తుల ధరలు దిగిరావడమేనని వెల్లడించారు. అంతర్జాతీయంగా కమోడిటీ ధరలు తగ్గినందున, ఎరువులకు సబ్సిడీ అంచనాను కుదించామన్నారు. ఎరువుల సబ్సిడీకి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1.88 లక్షల కోట్లు కేటాయించగా, వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఈ కేటాయింపును రూ.1.64 కోట్లకు తాజా మధ్యంతర బడ్జెట్లో తగ్గించారు. అలాగే ఆహార సబ్సిడీ కేటాయింపుల్ని సైతం రూ.2.12 లక్షల కోట్ల నుంచి తగ్గించి రూ.2.05 లక్షల కోట్లుగా ప్రతిపాదించారు. ఈ తరహాలో సబ్సిడీల భారం తగ్గడం, రెవిన్యూ వృద్ధిచెందడం, పన్నుయేతర ఆదాయం కూడా పెరగడంతో 2024-25 సంవత్సరానికి ద్రవ్యలోటు అంచనాల్ని 5.1 శాతానికి తగ్గించగలిగామని వివరించారు. పరిమాణం రీత్యా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు అంచనా (రూ.17,34,773 కోట్లు (జీడీపీలో 5.8 శాతం)కాగా, వచ్చే ఏడాదిలో రూ.16,85,494 కోట్లు ఉంటుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా సమర్పించిన మధ్యంతర బడ్జెట్లో పేర్కొన్న సంగతి తెలిసిందే.

# ఇన్వెస్టర్లకు ఓటింగ్ హక్కులుండవు

### సీఈవో మార్పుపై బైజూస్




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: సీఈవో లేదా యాజమాన్య మార్పుపై ఇన్వెస్టర్లకు ఎటువంటి ఓటింగ్ హక్కులూ ఉండవని ఎడ్యుటెక్ దిగ్గజం బైజూస్ స్పష్టంచేసింది. బైజూస్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు, యాజమాన్య నియంత్రణ నుంచి వ్యవస్థాపకుల్ని తొలగించేందుకు అత్యవసర సర్వసభ్య సమావేశాన్ని (ఈజీఎం) నిర్వహించాలంటూ కంపెనీలో పెట్టుబడులు చేసిన ఇన్వెస్టర్లు డిమాండ్ చేసిన నేపథ్యంలో శుక్రవారం బైజూస్ బ్రాండ్ నేమ్‌తో కార్యకలాపాలు నిర్వహిస్తున్న థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ వివరణ ఇచ్చింది. వ్యవస్థాపకుడు, గ్రూప్ సీఈవో బైజూస్ రవీంద్రన్‌ను మార్చడానికి కొంతమంది ఇన్వెస్టర్లు ఈజీఎం జరపాలంటూ ప్రకటనలివ్వడం విచారకరమని థింక్ అండ్ లెర్న్ పేర్కొంది. ఆర్థిక దుర్వినియోగం, పాలనా లోపాల కారణంగా డైరెక్టర్ల బోర్డును పునర్వ్యవస్థీకరించే తీర్మానం చేసేందుకు డాయిష్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ ప్రొసుస్ నేతృత్వంలో ఇన్వెస్టర్లు విడుదల చేసిన ఈజీఎం నోటీసులో పేర్కొన్నారు. ఈ నోటీసుకు జనరల్ అట్లాంటిక్, పీక్ వీఎక్స్, సోఫినా, చాన్ జుకర్‌బర్గ్, ఓవెల్, శాండ్స్ వంటి ఇన్వెస్టర్ల మద్దతు ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వీటన్నింటికీ కలిపి బైజూస్‌లో 30 శాతం వాటా ఉంది.

**రైట్స్ ఇష్యూకు అవాంతరం**


ఈ వారంలోనే బైజూస్‌కు చెందిన యూఎస్ సబ్సిడరీ అల్ఫా అమెరికా కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేసింది. మరో వైపు బైజూస్‌కు వర్కింగ్ మూలధనం కొరవడటంతో ఉద్యోగులు వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతున్నదని వార్తలు వెలువడుతున్నాయి. ఇదే సమయంలో కొన్ని ఫండ్స్ ప్రస్తుత యాజమాన్యాన్ని మార్చాలన్న డిమాండ్ కారణంగా ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు బైజూస్ చేపట్టిన రైట్స్ ఇష్యూకు అవాంతరం ఏర్పడిందని విశ్లేషకులు అంటున్నారు. నిర్వహణా అవసరాలకు తాము ప్రతిపాదించిన 200 మిలియన్ డాలర్ల రైట్స్ ఇష్యూకు మెజారిటీ షేర్‌హోల్డర్ల మద్దతు లభించిందని, అయితే దురదృష్టవశాత్తూ కొద్దిమంది ఇన్వెస్టర్లు లేవనెత్తిన సమస్యలతో కంపెనీ, ఉద్యోగులు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తున్నదని బైజూస్ విడుదల చేసిన ప్రకటనలో వాపోయింది. వ్యవస్థాపకుడు ఒక బిలియన్ డాలర్లు పెట్టుబడి చేయడం మినహా గత రెండేండ్లుగా వెలుపలి ఇన్వెస్టర్ల పెట్టుబడులు కంపెనీలోకి రాలేదని, అందుచేతే త్వరితంగా నిధులు సమీకరించేందుకు రైట్స్ ఇష్యూ చేపట్టినట్టు బైజూస్ వివరించింది. ఈ ఇష్యూను పూర్తిచేస్తామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. బైజూస్ విలువ 22 బిలియన్ డాలర్లు ఉంటుందని 2022లో అంచనా వేయగా, కొద్దినెలలుగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడంతో ఈ విలువకు భారీగా కోత పడినట్టు విశ్లేషకులు చెపుతున్నారు.



## కావేరీ సీడ్స్ లాభంలో క్షీణత

హైదరాబాద్, ఫిబ్రవరి 2: ప్రముఖ విత్తనాల సంస్థ కావేరీ సీడ్స్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 69 శాతం తగ్గి రూ.11.78 కోట్లకు పరిమితమైంది. క్రితం ఏడాది ఇది రూ.38.08 కోట్లుగా ఉన్నది. సమీక్షకాలంలో కంపెనీ నిర్వహణ ఆదాయం రూ.144 కోట్ల నుంచి రూ.142.63 కోట్లకు తగ్గింది. నిర్వహణ ఖర్చులు 3.50 శాతం పెరిగి రూ.140.86 కోట్లకు చేరుకోవడం వల్లనే లాభాల్లో గండిపడిందని కంపెనీ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించారు. ముడి సరుకుల ధరలు 42 శాతం పెరగడం, ఉద్యోగుల ప్రయోజనాల 28 శాతం పెరగడం కూడా లాభాలపై ప్రభావం చూపాయి. కంపెనీ షేరు ధర 6.35 శాతం తగ్గి రూ.670 వద్ద నిలిచింది.

## 2024-25కి ఐటీఆర్ ఫారాలు నోటిఫై



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరం, 2024-25 అసెస్‌మెంట్ సంవత్సరానికి పన్ను రిటర్న్‌లు ఫైల్ చేయడానికి అవసరమయ్యే 2, 3, 5 ఐటీ రిటర్న్ ఫారాల్ని నోటిఫై చేసినట్టు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) శుక్రవారం తెలిపింది. రూ.50 లక్షల వరకూ ఆదాయం కలిగిన వ్యక్తిగత వేతన జీవులు రిటర్న్‌లు వేసే ఐటీఆర్-1, కంపెనీలకు కావాల్సిన ఐటీఆర్-6లను ఇప్పటికే 2023 డిసెంబర్, 2024 జనవరి నెలల్లో నోటిఫై చేయగా, మిగిలిన 2,3,5 ఫారాలను తాజాగా విడుదల చేసింది. నోటిఫై అయిన 1 నుంచి 6 వరకూ అన్ని ఐటీఆర్ ఫారాలు 2024 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తాయని సీబీడీటీ తెలిపింది. ఫైలింగ్‌ను మరింత సరళతరం చేస్తూ ఐటీఆర్‌ల్లో మార్పులు చేసినట్టు వెల్లడించింది. ఐటీఆర్-1 (సహజ్) ఫైల్ చేయడానికి అర్హులుకాని, వ్యాపారం లేదా వృత్తుల ద్వారా ఆదాయం ఆర్జించని వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్‌లు) ఐటీఆర్-2 ద్వారా రిటర్న్ వేయాలి. వ్యాపారం లేదా వృత్తుల ద్వారా ఆదాయంగలవారు ఐటీఆర్-3ని ఫైల్ చేయవచ్చు. రూ.50 లక్షల వరకూ మొత్తం ఆదాయం కలిగి, వ్యాపార, వృత్తుల నుంచి ఆదాయం పొందుతున్న భారత నివాసులు, హెచ్‌యూఎఫ్‌లు, సంస్థలు (ఎల్ఎల్‌పీలు మినహా) ఐటీఆర్-4 (సుగమ్)ను దాఖలు చేయాలి. భాగస్వామ్య సంస్థలు, ఎల్ఎల్‌పీలు ఫారం-6, సెక్షన్ 11 కింద మినహాయింపులు క్లెయిం చేయని కంపెనీలు ఫారం-6ను ఉపయోగించాలి.

## బీవోఐ ప్రాఫిట్‌లో 62 శాతం వృద్ధి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: మొండి బకాయిలు తగ్గుముఖం పట్టడంతో ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ) లాభాల్లో భారీ వృద్ధిని సాధించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.1,870 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.1,151 కోట్లతో పోలిస్తే 62 శాతం వృద్ధిని సాధించింది. ఏడాది క్రితం మూడో త్రైమాసికంలో రూ.14,160 కోట్లుగా ఉన్న బ్యాంక్ ఆదాయం గత త్రైమాసికానికిగాను రూ.16,411 కోట్లకు ఎగబాకినట్లు వెల్లడించింది. సమీక్షకాలంలో బ్యాంక్‌కు వడ్డీల మీద వచ్చే ఆదాయం రూ.12,728 కోట్ల నుంచి రూ.15,218 కోట్లకు చేరుకున్నది. స్థూల నిరర్థక ఆస్తుల విలువ 7.66 శాతం నుంచి 5.35 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ 1.61 శాతం నుంచి 1.41 శాతానికి దిగొచ్చింది. బ్యాంక్ అడెక్వసీ రేషియో 15.60 శాతం నుంచి 16.06 శాతానికి పెరిగాయి.




## టాప్‌గేర్‌లో టాటా మోటర్స్

**క్యూ3లో రూ.7,100 కోట్ల లాభాన్ని ఆర్జించిన సంస్థ**

ముంబై, ఫిబ్రవరి 2: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటర్స్ విశ్లేషకుల అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను సంస్థ రూ.7,100 కోట్ల నికరలాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.3,043 కోట్ల లాభంతో పోలిస్తే రెండింతలు పెరిగినట్టు సంస్థ వెల్లడించింది. సమీక్షకాలంలో కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 25 శాతం అధికమై రూ.1,10,600 కోట్లు ఆర్జించింది.

- కంపెనీ రుణం 9,500 కోట్లు తగ్గడంతో మొత్తం అప్పు రూ.29,200కి తగ్గింది.
- సంస్థ ఆదాయంలో కమర్షియల్ వాహనాలను విక్రయించడంతో రూ.20,100 కోట్ల నిధులు సమకూరాయి.
- ప్యాసింజర్ వాహన విక్రయాలతో రూ.12,900 కోట్ల ఆదాయం సమకూరింది.
- జేఎల్ఆర్ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 7.4 బిలియన్ పౌండ్లు ఆర్జించింది.

*వాహన విభాగాలన్ని రాణించడం వల్లనే మూడో త్రైమాసికపు లాభాలు రెండురెట్లు పెరిగాయి. పండుగ సీజన్ కావడంతో వాహనాలకు డిమాండ్ ఊపందుకోవడం, నూతన వాహనాలను విడుదల చేయడం కూడా కలిసొచ్చింది. గత త్రైమాసికంలో నికరంగా రూ.9,500 కోట్ల అప్పును తగ్గించుకోలిగాం. గత ఆరు త్రైమాసికాలుగా నిలకడైన వృద్ధిని సాధిస్తున్నాం.*

*- బీ బాలాజీ, టాటా మోటర్స్ గ్రూపు సీఎఫ్‌వో*




## వైభవంగా భారత్ మొబిలిటీ ఎక్స్‌పో

### పలు మాడళ్లను ప్రదర్శించిన ఆటోమొబైల్ సంస్థలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: భారత్ మొబిలిటీ ఎక్స్‌పో అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ ఎక్స్‌పోలో పలు ఆటోమొబైల్ సంస్థలు తమ మాడళ్లను ప్రదర్శించాయి. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ..2014 కంటే ముందు పదేండ్లలో 12 కోట్ల వాహనాలు అమ్ముడవగా, 2014 నుంచి ఇప్పటి వరకు 21 కోట్ల వాహనాలు దేశీయంగా అమ్ముడయ్యాయన్నారు. అలాగే పదేండ్ల క్రితం కేవలం 2 వేల ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడవగా, ప్రస్తుతం ఈ సంఖ్య 12 లక్షల యూనిట్లకు చేరుకున్నాయన్న ఆయన..ప్యాసింజర్ వాహనాలు కూడా టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయని చెప్పారు. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2024లో మారుతి సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టయోటా, బెంజ్, బీఎండబ్ల్యూలు పలు రకాల ఫ్యూయల్ టెక్నాలజీస్, సీఎన్‌జీ, హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రదర్శించాయి.





- *మారుతి సుజుకీ ఈవీఎక్స్, ఫ్లెక్స్-ఫ్యూయల్ వ్యాగన్ ఆర్, హైబ్రిడ్ గ్రాండ్ విటారా, జిమ్నీలతోపాటు స్కైడ్రైవ్ ఈ-ఫ్లైయింగ్ కారును ప్రదర్శించింది.*
- *లగ్జరీ కార్ల సంస్థ బెంజ్ కాన్సెప్ట్ ఈక్యూజీ, ఈ-వ్యాగన్, జీఎల్ఏ, ఏఎంజీ గీఎల్ఈ 54 కూప్ వంటి మాడళ్లను ప్రదర్శించింది.*
- *ఎలక్ట్రిక్ బీ-ర్యాలీ-ఈ, ఎలక్ట్రిక్ ఎక్స్‌యూవీ400, ఎలక్ట్రిక్ 3డబ్ల్యూ ట్రియో, ప్రొటోటైప్ ఫ్యూయల్ వాహన టెక్నాలజీ మాడళ్లను ఉంచింది మహీంద్రా.*
- *ట్రావెల్లర్ ఎలక్ట్రిక్, అర్బనై డీజిల్, ట్రావెల్లర్ సీఎన్‌జీ మాడళ్లను ప్రదర్శించింది ఫోర్స్ మోటర్స్*
- *ఎలక్ట్రిక్ స్కూటర్స్ టీవీఎస్ ఎక్స్, టీవీఎస్ ఐక్యూబ్ మాడళ్లను ప్రదర్శించింది టీవీఎస్ మోటర్*

# ఐడీబీఐని అమ్మేస్తాం

## మరికొద్ది నెలల్లో పనైపోతుంది

### ప్రైవేటీకరణకు ఆర్బీఐ అనుమతే తరువాయి

## దీపం కార్యదర్శి తుహిన్ కాంత పాండే వెల్లడి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: ఈ ఏప్రిల్‌తో మొదలయ్యే ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఐడీబీఐ బ్యాంక్‌ను అమ్మేస్తామని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (దీపం) కార్యదర్శి తుహిన్ కాంత పాండే అన్నారు. పీటీఐ టీవీకి తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో పాండే మాట్లాడుతూ.. ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణ ప్రక్రియ కొనసాగుతున్నదని చెప్పారు. ఈ క్రమంలోనే రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఐడీబీఐ వ్యూహాత్మక విక్రయం పూర్తవుతుందన్న ధీమాను కనబర్చారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి భద్రతాపరమైన అనుమతి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి వ్యవస్థీకృత ఆమోదం లభిస్తే.. బ్యాంక్‌ను కొనేందుకు ఆసక్తి ఉన్నవారిని బిడ్ల ద్వారా ఆహ్వానిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఐడీబీఐ బ్యాంక్‌లో పరోక్షంగా, ప్రత్యక్షంగా కేంద్ర ప్రభుత్వానికి సుమారు 95 శాతం వాటా ఉన్నది. కేంద్ర ప్రభుత్వానికి 45 శాతం వాటా ఉండగా, ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)కు 49.24 శాతం వాటా ఉన్నది. ఇందులో అటు కేంద్రం, ఇటు ఎల్ఐసీ కలిసి దాదాపు 61 శాతం వాటాను అమ్మేయాలని చూస్తున్నాయి. ఇక 2022 అక్టోబర్‌లోనే బిడ్లను ఆహ్వానించగా, నిరుడు జనవరిలో కొంటామని కొందరు ముందుకు వచ్చినట్టు దీపం వర్గాలు చెప్తున్నాయి. కాగా, వచ్చే నెలాఖర్లోగా ఖజానాకు రూ.17,500 కోట్ల నిధులను కేంద్రం తెచ్చుకోవాల్సి ఉన్నది. సవరించిన అంచనాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్ఈ)ల్లో పెట్టుబడుల ఉపసంహరణ, ఆస్తుల నగదీకరణతో రూ.30,000 కోట్లను ఖజానాకు తరలించాల్సి ఉన్నది.